సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ၊ 8 ၊ ఆగస్టు ၊ 2023



సోమశిలలో 23.332 టీఎంసీలు

చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 23.332 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 541 క్యూసెక్కుల వరద వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,200
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,496
3 శాతం జీఎస్టీతో..	రూ.5,661
నవర (8 గ్రా)	రూ.45,288

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.5 /29.7

సోమవారం గాలిలో తేమ 47 శాతం ఉంది. మంగళవారం ఎండ తీవ్రత, ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడి రాక

నెల్లూరు(లీగల్): వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నెల్లూరు న్యాయవాదుల పరిచయ కార్యక్రమం స్థానిక హోటల్ శివంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జి అధ్యక్షుడు ఆర్.రోజారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

9న 2కె రన్

నెల్లూరు(సెంట్రల్): సీ ఫుడ్ ఫెస్టివల్‌ను పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీ ఉదయం 2కె రన్ నిర్వహిస్తున్నట్లు మత్స్యశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని వీఆర్సీ మైదానం నుంచి శ్రీకస్తూరిదేవీ గార్డెన్స్ వరకు ఈ రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 2023 సంవత్సరానికి గాను అందిస్తున్న వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్నల్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి వి.నాగరాజకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ట్స్, సోషల్‌వర్క్స్, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసిన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, సివిల్ సర్వీసెస్, క్రీడల్లో ప్రతిభ కనబరిచి ఆయా రంగాల్లో విశేష సేవలందించిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకొనే వారు క్రీడా రంగంలో వారు సాధించిన ప్రగతిని ఒక పేజీలో వివరిస్తూ వారి వివరాలతో పూర్తి చేసిన దరఖాస్తు, సంబంధిత పత్రాల నకళ్లు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయం, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అందజేయాలని తెలిపారు. ఈ దరఖాస్తులను పరిశీలించి అర్హత గల దరఖాస్తులను రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ, విజయవాడకు పంపుతామని తెలిపారు.

18 నుంచి వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



మాట్లాడుతున్న ఆర్డీఓ మలోల

వెంకటాచలం: గొలగమూడిలోని భగవాన్ వెంకయ్యస్వామి 41వ ఆరాధన మహోత్సవాలను ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు నెల్లూరు ఆర్డీఓ మలోల తెలిపారు. గొలగమూడిలోని వెంకయ్యస్వామి ఆశ్రమంలో ఆరాధనోత్సవాల ఏర్పాట్లపై ఆశ్రమ ఈఓ పీ బాలసుబ్రహ్మణ్యంతో కలిసి ఆర్డీఓ మలోల సోమవారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఆరాధన మహోత్సవాలకు తరలివచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. గొలగమూడికి ప్రత్యేకంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. రథోత్సవం, తెప్పోత్సవం రోజున పోలీసు, విద్యుత్, అగ్నిమాపక శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆశ్రమ ఈఓ పీ బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలకు వచ్చే భక్తులకు అన్నదానంతోపాటు తాగునీరు, వసతికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గ్రామంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రదేశాల్లో బారికేడ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రమేష్, సీఐ కే రామకృష్ణారెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20 వరకు ఈ–క్రాప్ నమోదు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని అన్ని పంటలకు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్‌ను ఈ నెల 20వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు సిబ్బంది దాదాపు 55 శాతం పూర్తి చేశారని, మిగిలిన పంట నమోదు గడువు లోపు పూర్తి చేయాలని తెలిపారు. ఈ–క్రాప్ నమోదు చేసుకొని రైతులు గడువు లోపు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

ప్రతిభ చూపితే బంగారు భవిష్యత్



జవహర్ నవోదయ విద్యాలయలో ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు (ఫైల్)

జవహర్ నవోదయ విద్యాలయలో అందించే ఉత్తమ విద్యాబోధన, మెరుగైన వసతులు, ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడుతున్నాయి. మర్రిపాడు మండలం కృష్ణాపురంలో ఉన్న ఈ విద్యాలయంలో చదివిన ఎందరో ఇప్పటికే ఉన్నత స్థానాల్లో ఉండడంతో ఇక్కడ చదివేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు. ప్రస్తుతం దరఖాస్తు ప్రక్రియ జరుగుతున్న క్రమంలో విద్యార్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు.

కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయలో సీట్ల కోసం పోటీ

- డిజిటల్ క్లాస్‌రూమ్స్‌లో విద్యాబోధన
- విద్యార్థులకు మెరుగైన వసతులు
- ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్లు
- ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం కృష్ణాపురంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులకు బంగారు భవిష్యత్‌ను అందిస్తోంది. ఈ విద్యాలయంలో చదివిన విద్యార్థులెందరో ప్రస్తుతం డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా ఉన్నత స్థానాల్లో సేవలందిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విద్యాలయంలో తమ పిల్లలను చేర్చేందుకు ప్రతి ఏటా పోటీ పడుతుంటారు. 1986లో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాకొకటి చొప్పున జవహర్ నవోదయ విద్యాలయాలు ప్రారంభించగా జిల్లాలోని మర్రిపాడు మండలం కృష్ణాపురంలో ఈ విద్యాలయం ఏర్పాటైంది. 6వ తరగతి నుంచి ప్లస్2 అంటే 12వ తరగతి వరకు ఇక్కడ విద్యాబోధన చేస్తున్నారు. 6 నుంచి 8వ తరగతి వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో, 9 నుంచి 12వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. 2020 నుంచి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆధునిక ప్రక్రియలతో విద్యాబోధన కొనసాగిస్తున్నారు. కాగా ఈ



వ్యాయామం చేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు (ఫైల్)



విద్యార్థుల మెదడుకు పదును పెట్టే చదరంగం పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

విద్యాలయం ఏర్పాటుకు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి అప్పట్లో సాగులో ఉన్న తమ భూములను 40 ఎకరాలకుపైగా ప్రభుత్వానికి అందజేసి సహకారం అందించారు.

ప్రవేశాలకు పరీక్షా విధానం

కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. 6వ తరగతిలో 80 సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈ నెల 10న చివరి తేదీగా నిర్ణయించారు. ప్రవేశ పరీక్ష 2024 జనవరి 20న నిర్వహించనున్నారు. అర్హులైన విద్యార్థులు కామన్ సర్వీస్ సెంటర్‌లో, మీసేవ కేంద్రాలు లేదా మొబైల్ ద్వారా కూడా దరఖాస్తులు చేసుకోవచ్చు. సందేహాలకు విద్యాలయం హెల్ప్ డెస్క్ 94935 14644, 89850 07588 ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చు. ఆరో తరగతిలో ప్రవేశానికి 80 సీట్లు ఉండగా, 75 శాతం సీట్లు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు, 25 శాతం సీట్లు పట్టణ ప్రాంతాల వారికి కేటాయిస్తారు. ఎస్టీలకు 15 శాతం, ఎస్సీలకు 7.5 శాతం, బాలికలకు 1/3 శాతం , దివ్యాంగులకు 3 శాతం చొప్పున రిజర్వేషన్లు అమలు చేస్తారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన లేదా ప్రభుత్వ పాఠశాలల్లో 3, 4 తరగతులు చదివి ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు. జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ ఉమ్మడి నెల్లూరు జిల్లా వాసులందరూ ఈ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

మెరుగైన వసతులు

కృష్ణాపురంలో ఈ విద్యాలయంలో ఆధునిక సౌకర్యాలు, మెరుగైన వసతులు అందుబాటులో ఉన్నాయి. సీబీఎస్‌ఈ సిలబస్‌తో ఉత్తమ విద్యాబోధన కొనసాగిస్తున్నారు. తరగతుల నిర్వహణకు అకడమిక్ బ్లాక్, పాలనా సౌలభ్యానికి అడ్మినిస్ట్రేషన్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరు డార్మెటరీలు, భోజనశాలలు, బోధకులు, సిబ్బందికి ప్రత్యేక వసతి సముదాయాలు ఉన్నాయి. పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పలు రకాల వృక్షాలతో నవోదయ విద్యాలయం ఆవరణ ఆహ్లాదకరంగా ఉంటుంది.

ప్రత్యేకతలు

కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయానికి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. మొత్తం విద్యాబోధన డిజిటల్ క్లాస్‌రూమ్‌లలో జరుగుతుంది. 2022–23 విద్యాసంవత్సరం నుంచి 12వ తరగతి చదువుతున్నప్పుడే విద్యార్థుల ప్రతిభ ఆధారంగా హెచ్‌సీఎల్ కంపెనీ వారు క్యాంపస్ సెలక్షన్స్ నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తున్నారు. ఈ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల్లో అంతర్గతంగా దాగిఉన్న శాస్త్ర సాంకేతిక ప్రతిభను వెలికితీయడం కోసం అటల్ టింకరింగ్ ప్రయోగశాలను నిర్వహిస్తున్నారు. అవంతి సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం విద్యార్థులకు జేఈఈ మెయిన్స్, నీట్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నారు. ప్రతి ఇద్దరు విద్యార్థులకు ఒక ట్యాబ్ ఇవ్వడం ద్వారా మొత్తం విద్యాలయంలో 240 ట్యాబ్‌లతోపాటు ల్యాప్‌టాప్‌లు కూడా అందుబాటులో ఉంటున్నాయి. అలాగే విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించేందుకు ఎన్‌సీసీ, స్కౌట్స్, గైడ్స్‌గా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.



స్కౌట్స్ విభాగంలో శిక్షణ పొందుతున్న నవోదయ విద్యార్థులు (ఫైల్)

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయలో ప్రవేశాలకు ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన విద్యార్థులందరూ అర్హులు. విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో శారీరక, మానసిక పరిపక్వత పెంపొందించేందుకు నవోదయ విద్యాలయం ప్రత్యేక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది.

– ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్, జవహర్ నవోదయ విద్యాలయం

ప్రాణాంతక వ్యాధుల నుంచి
రక్షణకు టీకాలు

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

నెల్లూరు(బారకాసు): ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి తల్లి, బిడ్డ రక్షణ కోసం టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్(ఐఎంఐ) 5.0 కార్యక్రమాన్ని సోమవారం నగరంలోని ఎన్‌టీటీ కాలనీలో ఉన్న యూపీహెచ్‌సీలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ శిశువులు, పిల్లలు, గర్భిణులకు టీకా వేయడం ద్వారా వ్యాధుల నుంచి రక్షించేందుకు మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. గర్భిణులు, 5 ఏళ్ల లోపు చిన్నారులను వ్యాధులు, మరణాల నుంచి రక్షించేందుకు వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరి అని పేర్కొన్నారు. చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణే మనందరి బాధ్యత అని వైద్యసిబ్బందికి సూచించారు. వలస వచ్చే వారు, వెళ్లే వారు, సంచారజాతులలో ఉన్న గర్భిణులు, చిన్నారులను గుర్తించి వారికి టీకాలు వేసేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. వేయించుకోని వారిని గుర్తించి ప్రభుత్వం నిర్దేశించిన తేదీల్లో టీకాలు వేయాలని తెలిపారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లోనూ, ఉప ఆరోగ్య కేంద్రాల్లోనూ, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం చిన్నారులకు, గర్భిణులకు టీకాలు వేసే ప్రక్రియను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు హారిక, సునీల్, ప్రమోద్ తోపాటు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనుష్ 5.0 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

దేశభక్తిని చాటండి

- 9 నుంచి 'నాభూమి–నాదేశం'
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పక్కన కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(పొగతోట): స్వాతంత్య్ర సమరంలో ప్రాణాలు అర్పించిన సమరయోధులను స్మరించుకునేలా నిర్వహిస్తున్న అపూర్వమైన కార్యక్రమం 'నాభూమి–నాదేశం'ను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఆజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశభక్తిని చాటుకునే అవకాశం అందరికీ వచ్చిందన్నారు. భారత దేశ స్వాతంత్య్ర సంగ్రామంలో అనేక మంది త్యాగధనులు ప్రాణాలు అర్పించారని, దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధులను గుర్తుచేసుకునేలా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నాభూమి–నాదేశం' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మన రాష్ట్రంలో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9 నుంచి 30వ తేదీ వరకు 'నాభూమి–నాదేశం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి పంచాయతీలోనూ స్వాతంత్య్ర సమరంలో పోరాడి ప్రాణాలు కోల్పోయిన త్యాగధనుల పేర్లను శిలాఫలకాలపై లిఖించడం, అన్ని గ్రామాల్లోని మట్టిని సేకరించి ఢిల్లీకి పంపడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయి నుంచి దేశానికి సేవ చేసిన వారిని గుర్తించి స్మరించుకోవడం ప్రధాన కర్తవ్యమన్నారు. గ్రామ పంచాయతీల్లో శిలాఫలకాలు ఆవిష్కరించడం, ప్రతిజ్ఞ చేయడం, నేలతల్లికి వందనం, జాతీయ జెండా ఆవిష్కరణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో సేకరించిన మట్టిని ఈ నెల 30వ తేదీన ఢిల్లీలోని కర్తవ్యం పార్కుకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ 'నాభూమి–నాదేశం' కార్యక్రమంలో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన శిలాఫలకాల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సందేశాలు, గ్రామస్థాయిలో సేవ చేసిన జవాన్లు, పోలీసులు, స్వాతంత్య్ర సమరయోధుల పేర్లను ముద్రించనున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీలో 75 చెట్లను నాటడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, అసిస్టెంట్ కమిషనర్ శర్మదా పాల్గొన్నారు.

ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(పొగతోట): నెల్లూరులో ఈ నెల 11, 12, 13 తేదీల్లో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్న నేపథ్యంలో ఫుడ్ ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్లను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ ఎం.హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ ఆవిష్కరించారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫుడ్ ఫెస్టివల్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



కొండబిట్రగుంట ఘటనలో దర్యాప్తు ముమ్మరం

- ప్రాథమిక దర్యాప్తులో కీలక ఆధారాలు లభ్యం
- నిందితుల కోసం ప్రత్యేక బృందాల వేట

బిట్రగుంట: బోగోలు మండలం కొండబిట్రగుంటలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఒకే ఇంట్లో ముగ్గురిని దారుణంగా హతమార్చిన ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. భర్త చనిపోవడంతో ఉత్తరక్రియల కోసం కొండబిట్రగుంటలోని అత్తగారింటికి వచ్చిన మందాటి మౌనిక(32), ఆమె తండ్రి కృష్ణయ్య(65), అమ్మమ్మ శాంతమ్మ(75)లను ఆదివారం వేకువజామున దారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే. ఈ ఘటన స్థానికంగానే కాకుండా జిల్లా వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. క్లూస్ టీం కీలక ఆధారాలు సేకరించినట్లుగా తెలిసింది. ఘటన అనంతరం పరారీలో ఉన్న మౌనిక మామ(భర్త మధుసూదన్ తండ్రి) మందాటి మాల్యాద్రి, మరిది చంద్రమౌళి కోసం పోలీసులు వేట ముమ్మరం చేయగా, మౌనిక అత్తను ఘటన వెలుగులోకి వచ్చిన కొద్ది గంటల్లోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లుగా తెలిసింది. కాగా పరారీలో ఉన్న మందాటి మాల్యాద్రి, చంద్రమౌళి తమతోపాటు మౌనిక ఎనిమిదేళ్ల కుమారుడిని కూడా తీసుకెళ్లగా సోమవారం ఉదయం బుచ్చిలోని అమ్మమ్మ ఇంటికి సమీపంలో వదిలి వెళ్లినట్లుగా తెలిసింది. ఘటనలో ప్రత్యక్ష సాక్షిగా ఉన్న మౌనిక కుమారుడి నుంచి కూడా పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మునులపూడిలో విషాదం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని మునులపూడి గ్రామంలో సోమవారం విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికంగా ఉండే వడికుప్ప కృష్ణయ్య, అతని కుమార్తె మౌనిక, మౌనిక అమ్మమ్మ శాంతమ్మ బోగోలు మండలం కొండబిట్రగుంట గ్రామంలో ఆదివారం అతి దారుణంగా హత్యకు గురైన విషయం తెలిసిందే. కావలి ఏరియా ఆస్పత్రిలో ముగ్గురి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించగా కృష్ణయ్య, అతని కుమార్తె మౌనిక మృతదేహాలను బుచ్చిరెడ్డిపాళెం మండలం మునులపూడికి తరలించారు.శాంతమ్మ మృతదేహాన్ని దగదర్తి మండలం చౌటపుత్తేడు గ్రామానికి తరలించారు. మునులపూడికి కృష్ణయ్య, మౌనిక మృతదేహాలు రాగానే గ్రామస్తులంతా కన్నీరు పెట్టుకున్నారు. గ్రామంలో కలసిమెలసి ఉండే కృష్ణయ్య విగతజీవుడు కావడంతో బంధువులు, ఇరుగుపొరుగు వారు జీర్ణించుకోలేకపోయారు. అనంతరం మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించగా స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- కలెక్టర్ ఎం.హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ ఆవరణలో చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆప్కో స్టాల్‌ను రాష్ట్ర చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఆదిలక్ష్మితో కలసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం స్టాళ్లలో ప్రదర్శించిన చేనేత వస్త్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం, నారాయణరెడ్డిపేటకు చెందిన చేనేత కార్మికులు కొలమల దయాకర్, సీతా నాగేశ్వరరావు, శ్రీరాములును కలెక్టర్ జ్ఞాపిక, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో మనదేశంలో ఉత్పత్తి అయిన వస్తువులనే వినియోగించాలని జాతిపిత మహాత్మాగాంధీ పిలుపునిచ్చారని, వారి ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. వారి సంక్షేమానికి వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టి అర్హులకు ప్రతి సంవత్సరం రూ.24 వేల ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కార్మికులకు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలు ఏదో ఒక చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేయాలని, తద్వారా చేనేత రంగాన్ని ప్రోత్సహించిన వారవుతారని తెలిపారు. అలాగే జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గాంధీబొమ్మ వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని జాయింట్ కలెక్టర్ ఆర్.కూర్మనాథ్ ప్రారంభించగా ఈ ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి ఆనందకుమార్, నాబార్డు డీడీఎం రవిసింగ్, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



చేనేత దినోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



ఆప్కో స్టాల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

17న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నామని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశాలకు ఆయా స్థాయీసంఘ సభ్యులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

టీడీపీకి డిపాజిట్లు దక్కవు

- సోమిరెడ్డి చెల్లని కాసు
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీలో వంద కుటుంబాల చేరిక


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి

మనుబోలు: వచ్చే ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు దక్కవని, మాజీ మంత్రి సోమిరెడ్డి చెల్లని కాసులాంటి వాడని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలో అక్కంపేటకు చెందిన వంద కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో సోమవారం చేరాయి. మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి మంత్రి కాకాణి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మంత్రి కాకాణి మాట్లాడుతూ నాయకత్వం, పెత్తనం ఒకరిస్తే వచ్చేవి కావని కష్టపడి సాధించుకోవాలన్నారు. ఎవరిలో నాయకత్వ లక్షణాలు మెండుగా ఉంటాయో వారిని గుర్తించి ప్రోత్సహించడం తన బాధ్యతన్నారు. ఎవరికో నాయకత్వం అప్పగిస్తే నేను పార్టీలో ఉండనని బెదిరించే వారిని సంతోషంగా సాగనంపుతామే తప్ప భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. గతంలో పార్టీ మండల కన్వీనర్‌గా ఉన్న వ్యక్తి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. చంద్రబాబు పనైపోయిందని వచ్చే ఎన్నికల్లో టీడీపీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుందన్నారు. సోమిరెడ్డి నోరు తెరిస్తే అబద్ధాలు తప్ప నిజం మాట్లాడరని విమర్శించారు. 2019 వరకు జిల్లాలో ఎవరైనా టీడీపీ టికెట్ ఆశిస్తే నీకు ఎలా వస్తుందో చూస్తానని బెదిరించే సోమిరెడ్డి ఇప్పుడు తన టికెట్ కోసం ఇతర నాయకులను దేబిరిస్తున్నాడని ఎద్దేవా చేశారు. అక్కంపేటలో ఎన్ని కుటుంబాలు ఉన్నాయనే స్పృహ కూడా లేకుండా 150కుపైగా కుటుంబాలు టీడీపీలో చేరాయని ప్రచారం చేసుకుంటూ నవ్వులపాలవుతున్నాడన్నారు. ఎంపీపీ వజ్రమ్మ, మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, చిట్టమూరు నరసారెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధురెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, వెందోటి భాస్కర్‌రెడ్డి, గుమ్మడి వెంకటసుబ్బయ్య, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ముంగర రవీంద్రరెడ్డి, గుంజి రమేష్, దాసరి మహేంద్రవర్మ, తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని నిరూపిస్తే రాజీనామా చేస్తా

- చంద్రబాబుకు సవాల్ విసిరిన కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న


పార్టీలో చేరిన వారితో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం: మలిదేవి డ్రెయిన్ పూడికతీత పనుల్లో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని చంద్రబాబుకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సవాల్ విసిరారు. మండలంలోని పల్లాప్రోలులో టీడీపీకి చెందిన 25 కుటుంబాల వారు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ జలయజ్ఞం పేరుతో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపనలు చేసి ప్రారంభించారని తెలిపారు. జిల్లాలోని సంగం, నెల్లూరు బ్యారేజ్‌లకు వైఎస్సార్ శంకుస్థాపన చేయగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి చేసి ప్రారంభించారని వివరించారు. కృష్ణపట్నం పోర్టు చంద్రబాబు హయాంలో కేవలం కాగితాలకే పరిమితమైందని గుర్తుచేశారు. ఆ కాగితాలకు పట్టిన దుమ్ము దులిపి పోర్టుకు కార్యరూపాన్ని ఇచ్చిన వ్యక్తి వైఎస్సార్ అన్నారు. తెలుగుగంగను సైతం దివంగత సీఎం ఎన్టీఆర్ ఆధ్వర్యంలో తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల విషయంలో చంద్రబాబు చేసింది శూన్యమని, వాటిపై సభలు నిర్వహించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. మలిదేవి డ్రెయిన్ పూడికతీత పనుల్లో అవినీతి జరిగినట్లు చంద్రబాబు ఆరోపణలు చేశారని, ఈ పనులు చేపట్టి రెండున్నరేళ్లు గడిచినా సంబంధిత కాంట్రాక్టర్ ఇంత వరకు ఒక్క రూపాయి కూడా తీసుకోలేదన్నారు. ప్రస్తుతం రూ.30 కోట్లు బిల్లుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. ఇలాంటి సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తీసేశారని ఆరోపించడంలో అర్థంలేదన్నారు. మలిదేవి డ్రెయిన్ పనుల్లో అవినీతి జరిగినట్లు చంద్రబాబు నిరూపించాలని సవాల్ విసిరారు. భవిష్యత్‌లో అధికారంలోకి వస్తామనే భ్రమలో చంద్రబాబు ఉన్నారని, పవన్ కళ్యాణ్ కూడా పగటి కలలు కంటున్నారని విమర్శించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్‌చైర్మన్ షాహుల్, మండల, పట్టణ పార్టీ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు కోడూరు మదనసూదన్‌రెడ్డి, కావలి వెంకటేశ్వర్లు, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఒక్క ఎకరా ఎండిపోలేదు

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో కావలి నియోజకవర్గంలో ఎక్కడా ఒక్క ఎకరా కూడా పంట ఎండిపోలేదని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గౌరవరం గ్రామ సచివాలయంలో సోమవారం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో చిట్టచివరి ఎకరాకు కూడా సాగునీరందిందని చెప్పారు.రెండో పంటకు సైతం సాగునీరు ఇచ్చామని గుర్తుచేశారు. కావలి నియోజకవర్గంలో ఇలాంటి సుభిక్షమైన పరిస్థితిని గతంలో ఎన్నడూ రైతులు చూడలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో కూడిన పరిపాలనకు తోడు ప్రకృతి సైతం ఆశీర్వదించడంతోనే ఇది సాధ్యమైందన్నారు. వరదలు వచ్చినప్పుడు పంట పొలాలు ముంపునకు గురవుతున్న విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అందుకు సంబంధించి అంచనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. కావలి మండలంలోని గౌరవరం, సిరిపురం, చెన్నాయపాళెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. గౌరవరంలో జగనన్న సురక్షలో 1,200 అర్జీలు రాగా, వాటిని అధికారులు పరిష్కరించారని చెప్పారు. గౌరవరంలో ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.17 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిమ్మధరలు
పొదలకూరు (కిలో)

పెద్దవి	: రూ. 25
సన్నవి	: రూ.15
పండ్లు	:రూ. 5



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	రూ.119
లేయర్ లైవ్	రూ. 88
బ్రాయిలర్ చికెన్ :	రూ.210
స్కిన్‌లెస్ చికెన్ :	రూ.232
లేయర్ చికెన్ :	రూ.150



గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం


మనోజ్‌కుమార్ మృతదేహం

సంగం: కోలగట్లలో ఆదివారం పెన్నానదిలో గల్లంతైన మనోజ్‌కుమార్(17) అనే ఇంటర్ విద్యార్థి మృతదేహం సోమవారం లభ్యమైంది. వివరాలు.. సంగంలోని రాళ్లచెలికకు చెందిన మనోజ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కోలగట్లలోని నాగార్పమ్మ ఆలయానికి వచ్చాడు. పూజల అనంతరం పెన్నానదిలోకి ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. పోలీసులు చీకటిపడే వరకు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టి నిలిపివేశారు. సోమవారం ఉదయం తిరిగి గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మనోజ్‌కుమార్ మృతితో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి విద్యార్థి మృతదేహాన్ని పంచనామాకు తరలించారు.

విద్యుదాఘాతానికి చిన్నారి బలి


శివకేశవ్ మృతదేహం

నెల్లూరు రూరల్ : విద్యుత్ షాక్‌తో మూడేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన నెల్లూరు రూరల్ పరిధిలోని అల్లీపురం టిడ్కో గృహ సముదాయం వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు..నగరంలోని ఓ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలువురికి పునరావాసంగా అల్లీపురంలోని టిడ్కో గృహ సముదాయంలోని డీ బ్లాకులోని కొన్ని గృహాలను తాత్కాలికంగా కేటాయించారు. ఈ బ్లాక్‌లో నివశిస్తున్న శివకేశవ్ అనే మూడేళ్ల బాలుడు ఆడుకుంటూ ఫీజు లింక్‌ను తాకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తల్లిదండ్రులు, స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయంపై రూరల్ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

కావలి రూరల్ : కావలి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని బాలకృష్ణారెడ్డినగర్‌లో నిర్వహిస్తున్న పేకాటస్థావరంపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు కావలి రూరల్ సీఐ ఎం రాజేష్ తెలిపారు.

జిల్లాలో వైఎస్సార్‌సీపీదే గెలుపు

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్


స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): 2024 ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి పీఠం ఎక్కించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్ అన్నారు. నగరంలోని 46వ డివిజన్ సక్కలోళ్లసెంటర్, బృందావనం, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా..లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ఎప్పుడూ వైఎస్సార్‌సీపీకి అడ్డా అన్నారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు నెల్లూరుకు ఎప్పుడొచ్చాడో ఎప్పుడు వెళ్లాడో కూడా ప్రజలకు తెలియదన్నారు. మాజీ సీఎం వచ్చిన విషయం కూడా ప్రజలకు తెలియలేదంటే ఆయన దుస్థితి ఏంటో అర్థమవుతుందన్నారు. జిల్లాలో మొత్తం సీట్లు గెలుస్తామని చంద్రబాబు నాయుడు చెప్పడం మేకపోతు గాంభీర్యం తప్ప ఇంకేమి లేదన్నారు. టీడీపీ మహిళల ఇబ్బందులు పడుతున్నారని చెబుతూ మహిళా శక్తి కార్యక్రమం నిర్వహిస్తుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారం రోజులుగా ఓ మహిళ గొంతు చించుకుని అన్యాయం జరిగిందని, ఓ కీచకుడు ఇబ్బంది పెడుతున్నాడని అరుస్తున్నా ఆమె ఆర్తనాదాలు ఏమిటని తెలుసుకోలేకపోతున్నారన్నారు. ఆమెకు జరిగిన అన్యాయంపై కనీసం టీడీపీ, జనసేన నాయకులు ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. వారు రాష్ట్రంలోని మహిళలకు అన్యాయం జరుగుతోందని మాట్లాడడం ఎవరిని ఉద్దరించేందుకు అని ప్రశ్నిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారన్నారు. ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు ధైర్యంగా ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారన్నారు. కార్పొరేటర్ వేలూరు మహేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మామపై కర్రతో అల్లుడి దాడి

- తలకు బలమైన గాయం కావడంతో మామ మృతి

కావలి రూరల్: నిత్యం తాగి కుమార్తెను వేధించడంపై అడిగేందుకు వెళ్లిన మామపై అల్లుడు కర్రతో ఆదివారం రాత్రి దాడి చేశాడు. తలకు బలమైన గాయమవడంతో మామ మృతి చెందాడు. కావలి రూరల్ సీఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. కావలి మండలం చెన్నాయపాళెం పంచాయతీ మూలంపేటకు చెందిన ఈ శ్రీహరికి అదే గ్రామానికి చెందిన నంబూరి నాయుడుబాబు(49) తన కుమార్తె వసుంధరను ఇచ్చి వివాహం చేశాడు. మద్యానికి బానిసైన శ్రీహరి భార్యను నిత్యం కొడుతూ వేధిస్తుండడంతో ఆమె తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో అల్లుడ్ని అడిగేందుకు నంబూరి నాయుడుబాబు, కోటేశ్వరమ్మ దంపతులు వెళ్లారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న శ్రీహరి కర్రతీసుకుని మామపై దాడిచేయడంతో తలకు తీవ్రగాయైంది. నెల్లూరుకు తరలించగా చికిత్స పొందుతూ నాయుడుబాబు మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విషాదం మిగిల్చిన రోడ్డు ప్రమాదం

- చికిత్స పొందుతూ ఇద్దరు మృతి
- మృతులు పశ్చిమబెంగాళ్ వాసులు


ఆకాష్ మండల్ మృతదేహం


దినేష్ మండల్ మృతదేహం

బిట్రగుంట: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప సమీపంలో ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులు నెల్లూరులో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లుగా తెలిసింది. పోలీసుల వివరాల మేరకు..పశ్చిమబెంగాళ్‌కు చెందిన ఆరుగురు యువకులు ఉపాధి కోసం మారుతి ఓమ్నీ వ్యాన్‌లో బెంగళూరుకు వెళుతుండగా కప్పరాళ్లతిప్ప సమీపంలో ఆదివారం ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఓమ్నీ టైర్ పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన నిలిపి టైర్ మారుస్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మొత్తం నలుగురు తీవ్రంగా గాయపడగా, హుటాహుటిన 108 వాహనంలో కావలికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఇద్దరు క్షతగాత్రులను నెల్లూరుకు తరలించారు. నెల్లూరులో చికిత్స పొందుతున్న పశ్చిమ బెంగాళ్ యువకులు ఆకాష్ మండల్ (20), దినేష్ మండల్ (21) పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. కావలిలో చికిత్స పొందుతున్న మరో యువకుడి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పోలీసులు తెలిపారు.

10 నుంచి రెండు రైళ్లు తాత్కాలిక రద్దు

నెల్లూరు(సెంట్రల్): గూడూరులో మూడో లైన్ పనులు చేపడుతున్న దృష్ట్యా నెల్లూరు మీదుగా వెళ్లే జన శతాబ్ది, పినాకి ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. గూడూరు నుంచి మొదలయ్యే సింహపురి ఎక్స్‌ప్రెస్, విక్రమ సింహపురి ఇంటర్‌సిటీ రైళ్లు నెల్లూరులోని వేదాయపాళెం రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. సూళ్లూరుపేట-నెల్లూరు మెమూ రైలును రద్దు చేస్తున్నట్లు తెలిపారు. రైల్వే ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని కోరారు.

లారీ డ్రైవర్‌ది హత్యే

- పోలీసుల అదుపులో నిందితులు

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన లారీ డ్రైవర్‌ది హత్యేనని పోలీసుల విచారణలో తేలింది. భార్య, ఇద్దరు కుమారులు తమ స్నేహితులతో కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు..శివగిరికాలనీకి చెందిన షేక్ ఖలీల్(52), ఆఫ్రీన్ దంపతులు.వారి పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో ఎంబీఏ చేస్తుండగా, మిగిలిన ఇద్దరు కుమారులు ఇంటి వద్దే ఉంటున్నారు. ఖలీల్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 3న ఖలీల్ ఒంటిపై గాయాలతో ఇంట్లో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. సోదరుడు ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి భార్య, ఇద్దరు కుమారులను విభిన్న కోణాల్లో విచారించగా హత్య వెలుగులోకి వచ్చింది.

వేధింపులు తాళలేకనే..

ఖలీల్ తనపై, తన పిల్లలపై క్షుద్ర పూజలు చేయిస్తున్నారంటూ భార్యకు అనుమానం ఉండేది. ఇదే క్రమంలో రెండో కుమారుడు ఉద్యోగం కోల్పోవడం, ఇంట్లో పరిస్థితులు తారుమారవడంతో నిత్యం దంపతుల నడుమ గొడవలు జరుగుతుండేవి. ఖలీల్ తన భార్యను తీవ్రంగా కొడుతుండగా పలుమార్లు కుమారులు అడ్డుకుని సర్దిచెప్పినా ఆయన తీరులో మార్పు రాలేదు. ఈ నెల 2న సాయంత్రం తల్లీకుమారులు రొట్టెల పండకు వెళ్లి రాత్రి ఇంటికొచ్చారు. పెద్ద కుమారుడు బంధువుల ఇంటికి వెళ్లగా, ఖలీల్ అర్ధరాత్రి భార్యపై దాడి చేశాడు. దీంతో ఖలీల్ కాళ్లు, చేతులు విరగ్గొట్టాలని భార్య, ఇద్దరు కుమారులు నిర్ణయించుకున్నారు. తమ స్నేహితులను పిలిపించి ఇనుప రాడ్లు, రోకలిబండతో ఖలీల్‌పై విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో ఖలీల్ అపస్మారకస్థితిలోకి వెళ్లి నిద్రలోనే మృతి చెందాడని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. గుట్టుచప్పుడు కాకుండా ఖలీల్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు యత్నించగా మృతుడి సోదరుడు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హత్య విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో భార్య,ఇద్దరు కుమారులతో పాటు వారి నలుగురు స్నేహితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

కామాంధుడికి చెప్పుతో దేహశుద్ధి

కావలి రూరల్: ఆరు నెలలుగా వెంటపడి వేధిస్తున్న ఓ కామాంధుడికి మహిళ చెప్పుతో దేహశుద్ధి చేసింది. ఈ ఘటన కావలిలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. రెండో పట్టణ ఎస్సై గోపీచంద్ తెలిపిన వివరాల మేరకు..గూడూరుకు చెందిన ఓ మహిళ కలిగిరి ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తోంది. ఉద్యోగరీత్యా నిత్యం గూడూరు నుంచి కావలికి రైల్లో వచ్చి అక్కడి నుంచి కలిగిరికి వెళ్తుంది. ఆమె భర్త లేక ఒంటరిగా ఉండడం గమనించిన ప్రకాశం జిల్లా కరవాదికి చెందిన సంజీవరావు అనే కామాంధుడు కన్నేశాడు. డబ్బులు ఇస్తాను, పెళ్లి చేసుకుంటానని నిత్యం ఆమెను వేధించసాగాడు. గతంలో కలిగిరికి వెళ్లి వేధించగా ఆమె ఫిర్యాదుతో పోలీసులు అదుపులోకి తీసుకుని మందలించి విడిచిపెట్టారు. మళ్లీ ఆరు నెలలుగా ఆమె వెంటబడుతూ నిత్యం వేధించసాగాడు. ఈ నేపథ్యంలో సోమవారం రోజులాగే కావలి రైల్వే స్టేషన్‌లో దిగి కలిగిరి వెళ్లేందుకు బయటకు వస్తుండగా సంజీవరావు వెంటపడ్డాడు. విశ్వోదయ పాఠశాల వద్దకు చేరుకోగానే జనాభా రద్దీ ఉండడంతో ఆమె ధైర్యం చేసి సంజీవరావును పట్టుకుని చెప్పుతో దేహశుద్ధి చేసింది. అనంతరం దిశ పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్పందించిన రెండో పట్టణ పోలీసులు వచ్చి సంజీవరావును అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.